

## దేశ వైజ్ఞానిక సత్తాకు నిదర్శనం చంద్రయాన్

**ప్రజాశక్తి - నరసన్నపేట**

కోట్ల మంది భారతీయుల ఎదురుచూపులు ఫలించిన వేళ, చంద్రయాన్ - 3 జాబిల్లి దక్షిణ ధ్రువంపై క్షేమంగా దిగి చరిత్రను సృష్టించిన క్షణాలు ఎన్నటికీ మరిచిపోలేనివని ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ వైజ్ఞానిక సత్తాను ప్రపంచానికి చాటి చెప్పిన ఈ ప్రయోగం భావితరాలకు ఎంతగానో స్ఫూర్తినిస్తుందని తెలిపారు. ఇంతటి ఘన విజయానికి కారకులైన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. మున్ముందు దేశం మరిన్ని శక్తివంతమైన ప్రయోగాలకు చిరునామాగా నిలుస్తుందని ఆకాంక్షించారు.

ప్రపంచ స్థాయిలో దేశ ప్రతిష్టను అగ్రభాగాన నిలిపి... అంతరిక్ష చరిత్రలో సరికొత్త రికార్డును నెలకొల్పిన శాస్త్రవేత్తలకు జయహో అంటూ ఊరూవాడ జేజేలు పలికింది. చందమామ అందిన రోజైన ఈ రోజు భలే మంచి రోజు... పసందైన రోజు అంటూ జనం మోము మురిసిపోయింది. జయహో భారత్... సాహో ఇస్రో అంటూ యువత కేరింతలు కొట్టింది. ఒక్కమాటలో చెప్పాలంటే జగమే వెన్నెలైంది.

- చంద్రునిపై దిగిన చంద్రయాన్-3
- ఊరూవాడా వెల్లివిరిసిన ఆనందం
- జయహో భారత్ నినాదాలతో ప్రదర్శనలు



# భలే మంచి రోజు

**ప్రజాశక్తి - శ్రీకాకుళం యంత్రాంగం**

ఇస్రో చేపట్టిన చంద్రయాన్-3 ప్రయోగాన్ని జిల్లా ప్రజానీకం ఎంతో ఆసక్తిగా తిలకించింది. జాబిల్లిపై దిగే ఉత్కంఠ క్షణాలను చూసేందుకు టివిలు, సోషల్ మీడియాకు అతుక్కుపోయింది. జాబిల్లిపై చంద్రయాన్ అడుగుపెట్టి విజయగీతిక వీచిన క్షణాన ఆనందోత్సాహాల్లో మునిగిపోయింది. పలు పాఠశాలలు, కళాశాలల్లో ఎల్ఇడి తెరలను ఏర్పాటు చేసి ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు.

శ్రీకాకుళం నగరంలో సూర్యమహల్ కూడలిలోని వివేకానంద విగ్రహం వద్ద జాతీయ పతాకాలతో యువత సందడి చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలను అభినందిస్తూ ప్రదర్శన చేపట్టారు. సూర్యమహల్ నుంచి జి.టి రోడ్డు మీదుగా ఏడు రోడ్ల కూడలి వరకు పలు ప్రజా, యువజన, విద్యార్థి సంఘాలతోపాటు ప్రజలు బాణాసంచా పేలుస్తూ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

శ్రీకాకుళం రూరల్ మండలం ఒప్పంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇస్రోకు మద్దతుగా జయహో చంద్రయాన్-3 పేరిట ర్యాలీ నిర్వహించారు. పాఠశాల సైన్స్ క్లబ్ ఆధ్వర్యాన సైన్స్ ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి.ఉమాకుమారి పర్యవేక్షణలో ఈ ప్రదర్శన సాగింది.

నందిగాం మండలంలోని దేవళభద్ర ఉన్నత పాఠశాల విద్యార్థులు వినూత్నంగా చంద్రయాన్-3 అక్షర క్రమంలో రాళ్లని పేర్చి తమ సృజనాత్మకతను చాటుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.పూర్ణిమ ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జి.సిగడాం : కెజిబివిలో చంద్రయాన్ ప్రయోగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షిస్తున్న విద్యార్థులు

టెక్కలి మండలంలోని రావివలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చేసిన ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. ప్రధానోపాధ్యాయులు డి.భారతి ఆధ్వర్యాన నిర్వహించిన ఈ ప్రదర్శనలో భాగంగా విద్యార్థులు విక్రమ్ అనే అక్షరాల ఆకారంలో ప్రదర్శన నిర్వహించారు.

పలాస మండలంలోని బ్రాహ్మణతర్లా ఉన్నత పాఠశాల విద్యార్థులు రాళ్లతో చంద్రయాన్ అక్షరమాలను తయారు చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుల పాల్గొన్నారు.

కంచిలిలో విజయోత్సవ ర్యాలీ చేపట్టారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, యువజన సంఘాల సభ్యులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు త్రివర్ణ పతాకంతో మెయిన్ రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు.

జి.సిగడాం మండల కేంద్రంలోని కెజిబివిలో ప్రిన్సిపాల్ ఉషారాణి ప్రొజెక్టర్ ఏర్పాటు చేయడంతో చంద్రయాన్-3 ప్రత్యక్ష ప్రసారాన్ని విద్యార్థులు వీక్షించారు.



టెక్కలి : విక్రమ్ అక్షరాకృతిలో విద్యార్థులు




శ్రీకాకుళం అర్బన్ : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

## గులివిందలపేటలో పెద్దపులి

**ప్రజాశక్తి- కొత్తూరు**

మండలంలోని గులివిందలపేట పరిసరాల్లో పెద్దపులి పాదముద్రలు కనిపించడంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. వ్యవసాయ పనులకు వెళ్తున్న గిరిజనులు గ్రామ పొలిమేరల్లోని పొలాల్లో పెద్దపులి పాదముద్రలను గమనించారు. అటవీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అప్రమత్తమయ్యారు. పులి పాదముద్రలు వాస్తవమేనని, మంగళవారం రాత్రి పెద్దమడి, సోలిపి, పడలి, దబ్బగూడ వైపు పులి వెళ్లినట్లు తెలుస్తోందని అటవీ సెక్షన్ అధికారి లీలారావు తెలిపారు. దబ్బగూడ వద్ద రాత్రి 1.30 గంటల సమయంలో కుక్కలు ఎక్కువసేపు మొరిగాయని గ్రామస్తులు చెప్తున్నారని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాత్రిపూట బయట తిరగవద్దని సూచించారు.



పులి పాదముద్ర



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ లాఠకర్

## ఇంటింటి సర్వే శతశాతం పూర్తి

**ప్రజాశక్తి - శ్రీకాకుళం**

జిల్లాలో చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా-2024 ఇంటింటి సర్వే శత శాతం పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో 97.31 శాతం పూర్తయిందని, త్వరలో శతశాతం పూర్తి కానుందని వివరించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, బిఎల్‌ఒలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాలకు సంబంధించిన తొలగింపులు, చేర్పుల ఓటర్ల జాబితాలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ పరిశీలించారు. వీటిపై ఎటువంటి అభ్యంతరాలు తెలియజేయకపోవడంతో, మిగిలిన నియోజకవర్గాలకు చెందిన జాబితాల్లో ఏమైనా సందేహాలు ఉంటే వాటిని తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. బిఎల్‌ఒలు కొత్తగా నమోదు చేసిన, తొలగించిన ఓటర్లకు సంబంధించిన డాక్యుమెంటేషన్ పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. ఇందులో ఎటువంటి పొరపాట్లు జరిగినా సహించేది లేదని హెచ్చరించారు. సక్రమంగా డాక్యుమెంటేషన్ చేయని కంచిలి మండలం కోనాడ బిఎల్‌ఒను సస్పెన్షన్ చేయాలని, సంతబొమ్మాళి మండలం కొల్లిపాడులోని ఓటరుకు సంబంధించిన డాక్యుమెంటేషన్ సరిగా లేనందున బిఎల్‌ఒకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి పి.మురళీకృష్ణ, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, బిఎల్‌ఒలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణాలపై తప్పుడు నివేదికలు

- పంచాయతీరాజ్ ఇంజినీర్లపై కలెక్టర్ ఆగ్రహం
- ఐదుగురు ఎఇల సస్పెన్షన్‌కు ఆదేశం

**ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్**

జిల్లాలో చేపడుతున్న గ్రామ సచివాలయ భవన నిర్మాణాలపై పంచాయతీరాజ్ ఇంజినీర్లు తప్పుడు నివేదికలు సమర్పించడంపై కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు నివేదికలు ఇచ్చిన కవిటి, మందస, మెళియాపుట్టి, పోలాకి, వజ్రపుకొత్తూరు మండలాల పంచాయతీరాజ్ సహాయక ఇంజినీర్లను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో చేపడుతున్న ప్రాధాన్యతా భవన నిర్మాణాలపై ఆ శాఖ ఇంజినీర్లతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం సమీక్షించారు. నిర్మాణాలు పూర్తయిన గ్రామ, వార్డు సచివాలయ భవనాలను ఎందుకు అందజేయలేకపోతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణాలను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. మండలాల వారీగా నిర్మాణాల పురోగతిపై సమీక్షించిన ఆయన కవిటి, మందస, మెళియాపుట్టి, పోలాకి, వజ్రపుకొత్తూరు మండలాల్లో గ్రామ సచివాలయ భవన నిర్మాణాలపై ఇచ్చిన నివేదికలకు, క్షేత్రస్థాయిలో పనులకు పొంతన లేదన్నారు. తప్పుదోవ పట్టించే రీతిలో ఈ నివేదికలు ఉన్నాయని, సంబంధిత ఎఇలను సస్పెండ్ చేసేందుకు పంచాయతీరాజ్ కమిషనర్‌కు నివేదించాలని ఆదేశించారు. సచివాలయ భవనాలతో పాటు ప్రాధాన్యతా భవనాలైన రైతుభరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను నిర్దేశిత సమయానికి పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు చేపట్టిన భవన నిర్మాణ పనులకు బిల్లులు చెల్లించడం పూర్తయిందని, ఎక్కడైనా బిల్లులు పెండింగ్‌లో ఉంటే తక్షణమే అప్‌లోడ్ చేయాలని సూచించారు. చేపట్టబోయే పనులకూ నిధుల కొరత లేదని, సంబంధిత ఏజెన్సీలను సమన్వయం చేసుకుంటూ నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాని ఆదేశించారు. సమావేశానికి గైర్హాజరైన టెక్కలి ఎఇకి షోకాజ్ నోటీసు, నిర్మాణాల్లో పురోగతి కనబరచని సోంపేట ఎఇకి ఛార్జిమెమో ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షక ఇంజినీర్ వి.ఎస్.ఎస్.ఎన్ మూర్తి, కార్యనిర్వాహక ఇంజినీర్లు సురేష్, కుమార్, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు, ఎఇలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

## విద్యుత్ షాక్‌తో ఇద్దరు మృతి

- బోర్‌వెల్ వేస్తుండగా ప్రమాదం
- మృతులు ఒడిశా వాసులు

**ఎచ్చెర్ల :** మండలంలోని ముద్దాడ పంచాయతీ సెగిడిపేటలో విద్యుత్ షాక్‌తో ఒడిశాకు చెందిన కూలీలు సొర్ర బిష్ణు (34), హుడా బగ్దీరా (21) మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఒక రైతు పొలంలో బుధవారం బోరు వేస్తుండగా విద్యుత్ వైర్లు బోర్‌వెల్ పైపునకు తగలడంతో ఇద్దరూ విద్యుదాఘాతానికి గురయ్యారు. సంఘటన స్థలంలోనే వారిరువురూ మృతి చెందారు. మరో కూలీ తీవ్ర గాయాలపాలయ్యాడు. అతనిని శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎచ్చెర్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





## డైనమిక్ పవర్ పరిశోధనకు పేటెంట్

**ఎచ్చెర్ల :** ఎలక్ట్రికల్ వాహనాలను వేగంగా, సురక్షితంగా ఛార్జింగ్ చేయడానికి డైనమిక్ పవర్ కేటాయింపు అనే పరిశోధనకు గానూ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటిలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కోడా దిలీప్ కుమార్‌కు పేటెంట్ హక్కు లభించింది. ఈమేరకు భారత ప్రభుత్వం పేటెంట్ల కంట్రోలర్ జనరల్ కార్యాలయం ద్వారా పేటెంట్ హక్కు జారీ చేసింది. పేటెంట్ హక్కు పొందిన తొలి ఆదివాసీ దిలీప్ కుమార్ కావడం విశేషం. దిలీప్ కుమార్‌ను ట్రిపుల్ ఐటి డైరెక్టర్ పి.జగదీశ్వరరావు అభినందించారు. ప్రస్తుతం ప్రపంచం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ఆధారపడుతున్న నేపథ్యంలో ఈ ఆవిష్కరణ గణనీయమైన ప్రభావాన్ని చూపుతుందన్నారు. కార్యక్రమంలో ఒఎస్‌డి సుధాకర్‌బాబు, పరిపాలనా అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరినాయుడు, గేదెల రవి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



దిలీప్ కుమార్

## పనులను అప్‌లోడ్ చేయాలి

**కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్**

**పలువురు ఎంపిడిఒలకు షోకాజ్ నోటీసులు**

**ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్**

గడప గడపకు మన ప్రభుత్వంలో మంజూరైన పనులకు సంబంధించి ప్రతిపాదనలను తక్షణమే అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఎంపిడిఒలను ఆదేశించారు. ఈ పనులపై ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం సమీక్షించారు. మండలాల్లో చేపడుతున్న గడప గడపకు పనుల ఎస్టిమేషన్స్‌ను అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. జూలై కంటే ముందున్న పనులను తక్షణమే అప్‌లోడ్ చేయాలన్నారు. నరసన్నపేట, ఆమదాలవలస, సోంపేట, టెక్కలి, జలుమూరు ఎంపిడిఒలు సమావేశానికి గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఒను ఆదేశించారు. మంజూరు చేసిన పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలన్నారు.

పనులకు నిధుల కొరత లేదన్నారు. ప్రారంభించిన పనులను తక్షణమే పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, మున్సిపాల్టీల్లో తక్షణమే పనులు ప్రారంభించి బిల్లులు వెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు చేపడుతున్నట్లు ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఇ మూర్తి, సిపిఒ లక్ష్మీప్రసన్న, ఇఇలు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇలు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విఒఎల సమస్యలు పరిష్కరించాలి

- 5న డిఆర్‌డిఎ కార్యాలయం వద్ద ధర్నా
- జయప్రదం చేయాలి : వెలుగు విఒఎల సంఘం

**ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్**

విఒఎల సమస్యల పరిష్కారానికి సెప్టెంబరు ఐదో తేదీన డిఆర్‌డిఎ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు వెలుగు విఒఎల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.మహాలక్ష్మి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.ధనలక్ష్మి, జి.అసిరినాయుడు తెలిపారు. ధర్నాకు విఒఎలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సంఘ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడుతో కలిసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వెలుగు సంస్థలో పనిచేస్తున్న విఒఎలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, మూడేళ్ల కాల పరిమితిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విఒఎలకు వేతనాలు పెంచాలని, సిబిఒహెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని కోరారు. రూ.పది లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, అన్నిరకాల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విఒఎల పని భద్రతను, ఉపాధిని దెబ్బతీసే కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేసే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. గ్రామ సమాఖ్యల మెర్జ్ ఆపాలని, సంఘాలను విడగొట్టడం, కలపడం వంటి పనులు సెర్ప్ అధికారులే చేయడం సరైంది కాదన్నారు. విఒఎలను మెర్జ్ చేయడం వల్ల వేలాది మందికి ఉపాధి పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధికి నష్టం లేకుండా ఎక్కువ సంఘాలున్న విఒఎల నుంచి తక్కువ సంఘాలున్న విఒఎలకు సర్దుబాటు చేయాలన్నారు. ఇందులో ఎటువంటి రాజకీయ జోక్యం ఉండకూడదని చెప్పారు. ఇప్పటివరకు 15 సంఘాల్లోపు ఉన్న విఒఎలకు వేతనాలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విఒఎగా ఉపాధి కోల్పోయిన వారందరికీ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వయసు పైబడిన వారికి, అనారోగ్యంతో ఉన్న వారికి, వారి కుటుంబ సభ్యులకు విఒఎలుగా అవకాశం కల్పించాలన్నారు. జెండర్, వయసు, చదువు పేరుతో తొలగింపులు ఆపాలని కోరారు. లోకో యాప్ పని కోసం 5జి మొబైల్ ఫోన్లను ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. విఒఎలకు టార్గెట్ ఇచ్చే పద్ధతి ఆపాలన్నారు. గౌరవ వేతనం ఎం.ఎస్ అకౌంట్స్ వేయడం ఆపాలని, వేతనాల చెల్లింపు చెక్కులపై సిసి, ఎపిఎం సంతకాలు లేకుండా చూడాలన్నారు. రికవరీ పేరుతో వేతనాలు కోత విధించడం ఆపాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహాలక్ష్మి

### నూతన కమిటీ ఎన్నిక

సమావేశం అనంతరం సంఘ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా అల్లు మహాలక్ష్మి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వి.ధనలక్ష్మి, జి.అసిరినాయుడు, కోశాధికారిగా కె.సీతమ్మ, ఉపాధ్యక్షులుగా డి.జోగారావు, ఉప కార్యదర్శిగా ఎ.దుర్గమ్మ, కమిటీ సభ్యులుగా వి.మోహనరావు, జి.అరుణ, ఎం.ప్రభావతి, ఎస్.లక్ష్మి తదితరులు ఎన్నికయ్యారు.

## ఆదర్శప్రాయుడు ఆంధ్ర కేసరి

**ఘనంగా టంగుటూరి జయంతి వేడుకలు**

**ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్**

ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆదర్శప్రాయులని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. టంగుటూరి జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి బుధవారం నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు సేవలను గుర్తించిన ప్రభుత్వం ఆయన పేరును ఒక జిల్లాకు పెట్టిందన్నారు. 1940-50వ దశకంలో ఆంధ్రా రాజకీయాల్లో ఆయన కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన ఆయన ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి కావడం గొప్ప విషయమన్నారు. సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా పోలీసు తుపాకీకి ఎదురొడ్డి నిలిచిన ధీరోదాత్తుడని కొనియాడారు. ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.మురళీకృష్ణ, కలెక్టరేట్ ఇ-సెక్షన్ సూపరింటెండెంట్ డి.రామ్మూర్తి, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి గడ్డెమ్మ, జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి అనురాధ, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ధీరత్వానికి టంగుటూరి ప్రతీక : ఎస్‌పి**

జిల్లా పోలీసు కార్యాలయంలో టంగుటూరి చిత్రపటానికి ఎస్‌పి జి.ఆర్ రాధిక పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధీరత్వానికి టంగుటూరి ప్రకాశం పంతులు ప్రతీక అని అన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధనలో నిర్ణాయక పాత్ర పోషించారని కొనియాడారు. ఎస్ఇబి జెడి వి.ఎన్ మణికంఠ, ఎఎస్‌పిలు టి.పి విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి, డిఎస్‌పిలు ఎస్.బాలరాజు, విజయ్ కుమార్ ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఆర్ఐ ఉమామహేశ్వరరావు, సిఐలు పి.శ్రీనివాసరావు, సత్యనారాయణ, ఎస్ఐలు, కార్యాలయ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



టంగుటూరి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్



నివాళ్లర్పిస్తున్న ఎస్‌పి రాధిక



మాట్లాడుతున్న పగడాలమ్మ

## క్రీడలతోనే ఆరోగ్యవంతమైన జీవనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యార్థుల్లో క్రీడలు, వ్యాయామంపై ఆసక్తి పెరగాలని, అప్పుడే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని డిప్యూటీ డిఇఒ గార పగడాలమ్మ అన్నారు. పాఠశాలల్లో విద్యార్థులందరినీ క్రీడల్లో భాగస్వాములను చేయాలని సూచించారు. శ్రీకాకుళం రూరల్ మండలం మనసబుపేట గాయత్రి కళాశాలలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి పీడీ, పిఇటిల సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతేడాది స్కూల్ గేమ్ ఫెడరేషన్ క్రీడల్లో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవడానికి వ్యాయామోపాధ్యాలు ఎంతగానో శ్రమించారని అన్నారు. వారి శ్రమకు గుర్తింపు లభించిందన్నారు. పాఠశాల నిర్వహణలో వ్యాయామ ఉపాధ్యాల పాత్ర కీలకమని పూర్వ డిఇఒ తిరుమలచైతన్య అన్నారు. జిల్లా క్రీడా సాధికార సంస్థ చీఫ్ కోచ్ డాక్టర్ కె.శ్రీధర్‌రావు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా పోటీలను విజయవంతం చేయాలన్నారు. అక్టోబరు 2 నుంచి నవంబరు 9 వరకు ఆడుదాం ఆంధ్ర పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సచివాలయ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి ఇలా ఐదు స్థాయిల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబరు నెలలో క్రీడాకారుల నమోదు కార్యక్రమం మొదలవుతుందని చెప్పారు. 17 ఏళ్లు పైబడిన క్రీడాకారులందరూ అర్హులని పేర్కొన్నారు. జిల్లా పీడీ, పిఇటి అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వి.రమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పి.సుందరరావు, జిల్లా కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ బి.వి.రమణ, గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావు, వై.శేఖర్‌బాబు, పి.తవిటయ్య, ఎస్.సూరిబాబు, ఎం.తిరుపతిరావు, బి.సురేష్, ఎం.ఆనంద్ కిరణ్ పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎస్‌పి రాధిక

## బాధిత కుటుంబానికి అండ

### ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లా పోలీసుశాఖలో విధులు నిర్వహించి మృతి చెందిన అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఆర్మ్డ్ రిజర్వ్) వై.శేషయ్య కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్‌పి జి.ఆర్.రాధిక భరోసానిచ్చారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శేషయ్య కుటుబానికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.75 వేలు నగదు చెక్కులను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మృతుడి కుటుంబ సభ్యులకు జిల్లా పోలీసుశాఖ ఎల్లవేళల అండగా ఉంటుందని అన్నారు. కుటుంబానికి రావాల్సిన మిగిలిన ప్రయోజనలు సకాలంలో అందేటట్లు చర్యలు తీసుకోవాలని కార్యాలయం సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో సహాయ పరిపాలన అధికారి జి.సత్య, శోభారాణి, బి.సెక్షన్ సూపరింటెండెంట్ వై.లిల్లీబాయ్ పాల్గొన్నారు.

# శత శాతం ఇంటింటా సర్వే పూర్తి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఇంటింటి ఓటర్ల సర్వే శత శాతం పూర్తి అయినట్లు అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి బి. శాంతి అన్నారు. బుధవారం పట్టణంలోని మండల తహసిల్దార్ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో బుధవారం నాటికి 90 శాతం ఇంటింటి సర్వే పూర్తయినట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం ఓటర్లు 1,86,621 ఉండగా 1,84454 ఓటర్లను బూతు లెవెల్ అధికారులు, ఏజెంట్లు పరిశీలించినట్లు తెలిపారు. అందులో 2633 మంది గైర్హాజరైనట్లు 1253 మంది మరణించినట్లు గుర్తించామని, ఇప్పటివరకు నమోదైన ఫారం 6,7,8 వివరాలను అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందూశామని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో కొత్తగా ఓటు నమోదు కోసం 2452



మాట్లాడుతున్న ఆర్‌డిఒ శాంతి

తొలగింపు కోసం 1151 మార్పుల కోసం 4957 దరఖాస్తులు నమోదైనట్లు తెలిపారు. ఇంటింటి సర్వే ఈనెల 21వ తేదీతో ముగిసినట్లు తెలిపారు. ఓటర్ల నమోదు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని అర్హత గల ప్రతి పౌరుడు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇంటింటి సర్వేలో జాడ తెలియని ఓటర్ల జాబితా తయారు చేసి సంబంధిత పోలింగ్ కేంద్రం పరిధిలో ఉంచామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ఓటర్ల జాబితాలో నమోదైన చిరునామాకు నోటీసులను పంపి వారి వివరణను 15 రోజుల్లో కోరడం జరుగుతుందని , ఎటువంటి వివరణ రాకపోతే వారి ఓట్ల తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సర్వే విజయవంతం చేసిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, సహకరించిన అధికారులకు ఆమె కతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో జరిగే కార్యక్రమాలు కూడా ఇదేవిధంగా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో నాలుగు మండలాల తహసీల్దార్లు ఎస్..గణపతి రావు, బి. రమేష్ కుమార్, ఎస్. రమణారావు, వెంకటేశ్వరరావు, ఎన్నికల డిప్యూటీ తాసిల్దార్ మురళీధర్ నాయక్, రాజకీయ పార్టీల ప్రతినిధులు వైఎస్ఆర్సిపి గురుగుబెల్లి శ్రీనివాసరావు, టీడీపీ నుంచి బీవీ రమణమూర్తి, కాంగ్రెస్ పార్టీ నుంచి ఎల్. సునీల్ కుమార్, బి.జె.వి. నుండి చింతాడ అప్పారావు పాల్గొన్నారు.

## లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం తగదు

### డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్

బూర్జ : ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోయినని డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్ హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో క్లస్టర్ పరిధిలోని బూర్జ, ఎల్ఎన్‌పేట, బూర్జ మండలాల కో-ఆర్డినటర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. స్త్రీనిధి, బ్యాంకు లింకేజ్, పిఎంఆర్ఎంజి లోన్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా క్లస్టర్ కో-ఆర్డినేటర్లు విధి నిర్వహణలో ఆలసత్వం వహించరాదని అన్నారు. గ్రూప్ సభ్యుల వద్ద నుంచి రూ.12 చొప్పున వసూలు చేయాలని ఆదేశించామని, అందులో బూర్జ మండలానికి రూ.1,46,950 లక్ష్యం కాగా, రూ.70 వేలు మాత్రమే వసూలు చేశారని అన్నారు. అలాగే ఎల్ఎన్‌పేట మండలానికి సంబంధించి రూ.1,50 వేలు మాత్రమే మాత్రమే వసూలు చేశారన్నారు. సరుబుజ్జిలి ఒక రూపాయి వసూలు చేయక సున్నా స్థానంలో ఉన్నారన్నారు. గ్రూపు సభ్యుల నుంచి జనరల్ ఫండ్ క్యాష్లు చేయడం చేతకాకపోతే తానే వసూలు చేసి చూపిస్తానని అన్నారు అలాగే ఎస్‌హెచ్‌జి గ్రూప్‌లకు వెజిటేబుల్ సీడ్స్ ఎరువులు పెట్టుబడి అందించడంతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని అన్నారు. దీని కోసం సిసిలు విత్తనాలకు సభ్యుల నుంచి డబ్బులు వసూలు చేయాలన్నారు. అలాగే రాగులు, జొన్నలు తదితరులు పండించడం వల్ల అధిక లాభాలు సంపాదించడానికి అవకాశం ఉంటుందని అవగాహన కల్పించాలన్నారు. సిసిలు తమ పరిధిలో బ్యాంకు లింకేజీ



మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్

జనరల్ ఫండ్ సంబంధించి లక్ష్యం పూర్తి చేయాలని ఆదేశించారు. నవంబరు 3న పెద్ద ఎత్తున ప్రజాసభలు నిర్వహించేందుకు సలహాలు చేస్తున్నామని తెలిపారు. ఈలోగా తమ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎడిఎ నారాయణరావు, డిపిఎంఐపి మోహనరావు, డిపిఎం రామ్మోహనరావు, బ్యాంక్లింకేజ్ డిపిఎం ఎ.నాగలక్ష్మి, సత్యనారాయణ, బి.రమణమ్మ, కళ్యాణి రవికుమార్, కమల్‌కుమారి పాల్గొన్నారు.

## ఆక్రమణలు అడ్డగింత

### అధికారులకు ఫిర్యాదు

నౌపడ : సంతబొమ్మాళి మండలం నౌపడ వైఎస్సార్ కాలనీలో విలువైన స్థలాన్ని కొందరు వైసిపి నాయకుల అండతో ఆక్రమించి ఇల్ల నిర్మాణం చేస్తుండడంతో బుధవారం పంచాయతీ అధికారులు అడ్డుకున్నారు. గ్రామంలోని వైఎస్సార్ కాలనీలో ఏళ్ల తరబడి సుమారు 10 సెంట్లు ప్రభుత్వ స్థలం ఖాళీగా ఉంది. ఇటీవల ప్రభుత్వం అనాధ పిల్లలైన స్వాతి, పల్లవి నివాసం కోసం ఇళ్లను మంజూరు చేసింది. అది చూసిన ముగ్గురు వ్యక్తులు పథకం ప్రకారం స్థానిక వైసీపీ నాయకుల అండదండలతో దర్జాగా కర్రలు పాతి ఆక్రమించారు. బుధవారం ఇల్లు నిర్మాణాలకు పునాదులు తీస్తున్న సందర్భంగా పలువురు కాలనీ వాసులు నౌపడ సచివాలయంలో ఫిర్యాదు చేశారు. ప్రజా, ప్రభుత్వ అవసరాలకు వినియోగించే స్థలం ఆక్రమణకు గురవుతోందని ఫిర్యాదు చేశారు. అక్కడ అంగన్వాడీ,



ఆక్రమిత స్థలాన్ని పరిశీలిస్తున్న పంచాయతీ అధికారులు

పాలకేంద్రం, కమ్యూనిటీ హాల్, లేదంటే చిన్న పార్కులా ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం కాలనీలో 200 మంది నివాసం ఉంటున్నారని, వారికి సంబంధించి పలు కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఆ స్థలాన్ని చాలా ఏళ్ళుగా వినియోగిస్తున్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో స్థానిక సర్పంచ్ పిలక రవికుమార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఉమాపతి, సచివాలయ సిబ్బంది ఆక్రమణలు చేసిన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఎవరికి ఎటువంటి పట్టాలు లేకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు నిలుపుదల చేయాలని హెచ్చరించారు. ఫిర్యాదు చేసిన వారిలో అప్పలరాజు, ఈశ్వరరావు పలువురు యువకులు ఉన్నారు.

## అంతరిక్ష చరిత్రలో సరికొత్త రికార్డు

ఆమదాలవలస : అంతరిక్ష చరిత్రలో సరికొత్త రికార్డు సాధించిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలని జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు బొడ్డేపల్లి మోహనరావు అన్నారు. బుధవారం చంద్రయాన్ - 2 విజయవంతం కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. చంద్రయాన్ -2 విఫలం నుంచి సరికొత్త అధ్యాయం సృష్టించారని అన్నారు. దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన మొట్టమొదటి దేశం తమ దేశానికే దక్కుతుందన్నారు.

## బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం

సోంపేట : మండలంలోని పలాసపురం ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను జెడ్‌పిటిసి తడక యశోద బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తడక జోగారావు, హెచ్ఎం హరికృష్ణ, విద్యా కమిటీ చైర్మన్ కృష్ణారావు పాల్గొన్నారు.

## రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న హర్ష

ప్రజాశక్తి- సోంపేట

పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న ఓ చిన్నారికి రక్తం అవసరమైంది. విషయం తెలుసుకున్న స్థానిక రోటరీ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు స్పందించారు. చిన్నారికి రక్తం అవసరం కావడంతో హృదయం ఫౌండేషన్ సభ్యుడు మార్పు హర్ష రక్తం అందజేశారు. అతడికి రోటరీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, రోటరాక్ట్ ఉపాధ్యక్షుడు కర్రి మిన్నారావు అభినందించారు. హృదయం ఫౌండేషన్ ఎల్లవేళలా తన సహకారాలు అందిస్తున్న స్థానిక వైద్యులు యారాడి కృష్ణమూర్తికి రోటరీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## వినోద్‌కుమార్‌కు డాక్టరేట్



వినోద్ కుమార్

కొత్తూరు: మండలంలోని గురండి పంచాయితీ దాశరథిపురం గ్రామానికి.చెందిన యర్లంకి వినోద్ కుమార్‌కు శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. యూనివర్సిటీ భూ విజ్ఞాన శాస్త్రం జియాలజీ అసిస్టెంటు ప్రొఫెసర్ డాక్టర్ వి.గోపినాథ్ పర్యవేక్షణలో అప్లికేషన్ ఆఫ్ జియో స్పై సియేల్ టెక్నిక్ ఇన్ గ్రౌండు వాటర్ రిసోర్స్ మేనేజ్ మెంటు ఉద్దానం ఏరియా శ్రీకాకుళం అనే అంశం పై పరిశోధన చేశారు. పరిశోధనా గ్రంధాన్ని సమర్పించినందుకు డాక్టర్ రేటు ప్రదానం. చేసినట్లు విశ్వవిద్యాలయ నిర్వహణ అధికారి దంలా నాయక్ తెలిపారు. ఉద్దానం ప్రాంతం భూగర్భ జలాలులో భార లోహాలు, రేడియోధార్మిక పదార్థాలు పరిమితికి మించి ఉన్నట్లు తన పరిశోధనలో కనుగొన్నట్లు తెలిపారు. దేశంలో ఎన్ఐటిఐఐటి, నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నట్టు తెలిపారు. ఉద్దానంపై పూర్తిస్థాయిలో పరిశోధన చేస్తానన్నారు.



ఫ్యాన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

## దాసన్న దాతృత్వం

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట పట్టణంలోని బిసి బాలికల వసతి గృహానికి 8 టేబుల్ ఫ్యాన్లను ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ బుధవారం వితరణ చేసి దాతృత్వం చాటుకున్నారు. మరమ్మతులకు గురైన పాత సీలింగ్‌తో ఇబ్బందులు పడుతున్నామని బాలికలు ఇటీవల ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించి దాసన్న తన సొంత డబ్బులు రూ.40 వేలు వెచ్చించి 8 టేబుల్ ఫ్యాన్లు కొనుగోలు చేసి హాస్టల్ వార్డెన్ పద్మావతికి అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పాగోటి రాజారావు, మండల పరిషత్ విప్ వైశ్యరాజు కేశవరాజు, ఎస్‌సి సెల్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కోటిపల్లి శ్రీనివాస్, ప్రచార కమిటీ సభ్యులు మానెం శివ పాల్గొన్నారు.



కాలువలో పూడికలు తీస్తున్న రైతులు

## రైతుల శ్రమదానం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ప్రభుత్వం స్పందించకపోవడంతో మండలంలోని లెఖందిడ్డి, గంగరాం, యలమంచిలి, తోటాడ పంచాయతీలకు చెందిన రైతులు 36 ఆర్.గంగరాం వంశధార కాలువలో శ్రమదానం చేసి బుధవారం గుర్రపుడెక్కను తొలగించారు. ఈ కాలువ ద్వారా 4121 ఎకరాల్లో సాగునీరు అందుతుంది. కాలువల్లోని చెత్తా చెదారాలను ప్రభుత్వం తొలగించకపోవడంతో వరి పంట పొలాలు ఎండిపోతున్నాయి. దీంతో 200 మంది రైతులు స్పందించి చెత్తా చెదారాలను తొలగించారు. మూడేళ్ల క్రితం ఈ కాలువకు మరమ్మతులకు ఖందిడ్డి పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి బమ్మిడి గణపతిరావు రూ.6 లక్షలు పెట్టుబడి పెట్టి పనులు చేపట్టారని, ఇప్పటి వరకు వాటికి సంబందించిన బిల్లులు అధికారులు చెల్లించలేదని రైతులు చెబుతున్నారు.

## విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

విఆర్‌ఎల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ విఆర్‌ఎ యూనియన్ నాయకులు డిప్యూటీ తహశీల్దార్ గురుప్రసాద్‌కి వినతిపత్రం సమర్పించారు. విఆర్‌ఎల సమస్యలపై పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 25న చలో విజయవాడ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. వి.ఆర్.ఎ.లకు పే స్కేలు అమలు చెయ్యాలని, వి.ఆర్.వోలుగా పదోన్నతి కల్పించాలని కోరారు. పాత పద్ధతిలో ప్రమోషన్లు ఇవ్వాలని, మరణించిన వి.ఆర్.ఎ. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రీయ ఎరువులతో అధిక దిగుబడి

రణస్థలం రూరల్: సేంద్రీయ ఎరువులతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ అధికారి డి.విజయ భాస్కర రావు రైతులకు సూచించారు. మండలంలోని వేల్పురాయి గ్రామంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు వరిపొలంలో రసాయన ఎరువులు, పురుగు మందులు తగ్గించి ద్రవ జీవామృతం 20 రోజులకి ఒకసారి వదిలితే మంచి ఫలితాలను పొందవచ్చునని, సస్య రక్షణ పద్ధతి గురించి వివరించారు. ఎంపిటిసి మాజీ సభ్యులు రామకష్ణ, విఎఎలు వెంకటరమణ, ప్రశాంత్, యూనిట్ ఇన్చార్జ్ సన్యాసి రావు, ఐ.సి.ఆర్.పి.లు, సత్యవతి, ఎస్.డి.ఎ.జి.. రాంబాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

## చిన్నారికి స్త్రీనిధి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అండ

ప్రజాశక్తి- కవిటి

అరుదైన వ్యాధితో బాధపడుతున్న ప్రగడపుట్టుగకు చెందిన యాంద్రాపు ఆద్యకు హైదరాబాదుకు చెందిన స్త్రీనిధి గ్రూప్ ఆఫ్ కంపెనీ అండగా నిలిచింది. స్త్రీనిధి గ్రూప్ ఆఫ్ కంపెనీలో పనిచేస్తున్న కవిటి గ్రామానికి చెందిన బెందాళం శ్రీకాంత్ ఆదిత్య తండ్రి చిరంజీవి బ్యాంకు ఎకౌంట్‌కు బుధవారం రూ.లక్ష కంపెనీ తరపున విరాళంగా అందించారు. అదేవిధంగా వృత్తి రీత్యా అబుదాబిలో ఉంటున్న రత్నాల ప్రసాద్, తన స్నేహితులు కలిసి సేకరించిన రూ.24,500లు ఎమ్మెల్యే బెందాళం అశోక్ చేతులు మీదుగా ఆద్య తాతయ్యకు అందజేశారు. అలాగే శ్రీచైతన్య జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్



ఆద్య తాతయ్యకు నగదు ఎమ్మెల్యే అశోక్

(తిరుచానూరు) భావన శ్రావణి 5 వేలు, బెజ్జిపుట్టుగకు చెందిన శాస్త్రవేత్త బొర్ర జగదీష్ రూ.5 వేలు, ప్రగడపుట్టుగకు చెందిన ఉపాధ్యాయుడు పిరియా రమేష్ రూ.5 వేలు పాప వైద్యం కోసం అందించారు. కార్యక్రమంలో కవిటి కాలనీకి చెందిన సుధాకర్, దుర్గ, రాము రౌలో, సందీప్, శ్రీకాంత్, కేశవ పాల్గొన్నారు.





ర్యాలీ నిర్వహిస్తున్న సంఘమిత్ర వాలంటీర్లు

## మత్తుతో చిత్తు కావద్దు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మత్తుకు బానిసై చిత్తు కావద్దని సంఘమిత్ర వాలంటరీ ఆర్గనైజేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ సిహెచ్.విజయ్ రత్నకుమార్ (జానిబాబు) అన్నారు. ఎచ్చెర్ల ఎస్‌సి కాలనీలో డ్రగ్ డీఎడిక్షన్ కేంద్రం ఆధ్వర్యాన మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యం సేవించడం ద్వారా తాత్కాలిక ఆనందం కలుగుతున్నా... వాస్తవ పరిస్థితుల నుంచి తప్పించుకోడానికి దోహదపడుతున్నాయని అన్నారు. ముందుగా వ్యాపార, సామాజిక వేత్త సూర శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం.కపమ్మ, సబ్ స్టాఫ్‌నర్సు డి.ఇందిరాకుమారి, అనీల్‌కుమార్, సింహాచలం, శ్యామ్‌బాబు, దన్నాన ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## జీడి ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభం

కొత్తూరు : మండలంలోని కర్లెమ్మ పంచాయతీ మహాసింగి ఆర్టీకు ఎన్‌జిఒ భవనంలో గిరిజనులకు జీడి ప్రాసెసింగ్ యూనిట్‌ను ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాసెసింగ్ యూనిట్‌ను గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, ఎంపిటిసి



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రతినిధి జి.ఆనందరావు, బి.శ్రీను, తిరుపతిరావు, త్రినాథరావు, ఎపిఎం త్రినాథమ్మ పాల్గొన్నారు.

## టిడిపి తీరు గాంధేయవాదానికి కళంకం



విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న చైర్మన్ గిరిబాబు

ప్రజాశక్తి- పలాస

టిడిపి నాయకుల తీరు గాంధేయ వాదానికి కళంకమని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద టిడిపి కార్యకర్తలపై వైసిపి కార్యకర్త దాడి చేశారని చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తూ గాంధీ విగ్రహానికి బుధవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి ఇన్‌ఛార్జి గౌతు శిరీష నిరసన చూస్తే గాంధీజీ సాక్షిగా రెచ్చగొట్టే మాటలు మాట్లాడటం హేయమైన చర్యగా భావిస్తున్నామన్నారు. మద్యం తాగి అకతాయిలు చేసిన గొడవలకి పార్టీల రంగు పులిమి గాంధీజి విగ్రహం వద్ద రా చూసుకుందామంటూ తొడలు కొట్టడం మంచి పద్ధతికాదని హితవు పలికారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై, ఆయన సతీమణిపై అనుచిత వ్యాఖ్యలు మాట్లాడటం సరికాదన్నారు. గతంలో గౌతు కుటుంబం చేసిన అభివృద్ధి ఏమి లేదు కాబట్టే ప్రజల్లో శాంతిభద్రతల అంశాన్ని రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, జెడ్‌పిటిసి ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు, ఎంపిపి ప్రతినిధులు ఉంగ సాయికృష్ణ, ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, పలాస ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, ఎంఎంసి ఉపాధ్యక్షులు జినగ లోకేశ్వరి, పిట్ట గీతారాణి, కౌన్సిల్ ప్రతినిధి పాల్గొన్నారు.

## రాజుల చెరువు అభివృద్ధి అంతేనా?

### సెల్ఫీ ఛాలెంజ్ చేసిన మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట పట్టణంలో నడిబొడ్డున ఉన్న రాజుల చెరువు ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా గత ప్రభుత్వం ప్రణాళికలు వేసి నిధులు మంజూరు చేసిందని, ప్రభుత్వం మారి నాలుగున్నరేళ్ల అయినా ఇప్పటికీ చెరువు అభివృద్ధి చేయకపోవడం పూర్తి వైఫల్యమేనని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఈ మేరకు రాజులు చెరువులను బుధవారం పరిశీలించి సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వయాన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి గతేడాది నవంబరు 23న నరసన్నపేట వచ్చి రాజుల చెరువు అభివృద్ధికి రూ.పది కోటుల ప్రకటించినా ఇప్పటికీ అతీగతి లేదని అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పట్టణ ప్రజల ఇబ్బందులు, తాగునీటి సమస్య, వాకింగ్ ట్రాక్ దృష్టిలో పెట్టుకొని చెరువు అభివృద్ధి చేయాలనే ధృక్పథంతో పర్యాటక శాఖ నుంచి రూ.కోటికి పైగా నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించామని తెలిపారు. వర్షాభావ ప్రభావం వల్ల పనులు ఆలస్యమైనా 60 శాతం పనులు పూర్తయ్యాయని అన్నారు. ఇంతలోనే ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ఎక్కడి



సెల్ఫీ తీస్తున్న మాజీ ఎమ్మెల్యే రమణమూర్తి

పనులు అక్కడే నిలిచిపోయాయని పేర్కొన్నారు. అలాగే అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, రోడ్లు, ఆధునిక పార్కు పూర్తి చేశామని సెల్ఫ్ ఛాలెంజ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ గొద్దు చిట్టిబాబు, ఊర్న వెంకటేశ్వరరావు, జామి వెంకటరావు, కోరాడ రామచంద్రరావు, కింజరాపు రామారావు, పీసా కృష్ణ పాల్గొన్నారు.



ఖైదీలను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

## వైద్య శిబిరాలకు స్పందన

శ్రీకాకుళం రూరల్ : పలాస్ క్లబ్, క్యాజు ల్యాండ్ వనిత ఆధ్వర్యాన రాగోలు జెమ్స్ సౌజన్యంతో శ్రీకాకుళం రూరల్ మండలం అంపోల్ జిల్లా జైలులో ఖైదీలకు కంటి, బిపి, సుగర్ వంటి వైద్య పరీక్షలు వైద్యాధికారులు బుధవారం నిర్వహించారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్, నటుకల మోహనరావు, దేవభూషణరావు, మల్లా జయశ్రీ, తర్లాన శ్వేతకుమారి, కోశాధికారి మల్ల సంతోషి, టంకాల వినీల, నూలు తులసి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని జర్జంగి వద్ద ఉన్న హంసవాహిని హైస్కూల్ అవరణలో శ్రీకాకుళానికి చెందిన వి డెంటల్ ఆస్పత్రి ఆర్థిక సహాయంతో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు 150 మంది విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం దుర్గాప్రసాద్, డెంటల్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జాన్ మాడుగుల, మార్కెటింగ్ మేనేజర్ వెంకటేష్, పిఆర్‌ఒ మధుసూదన్, వాసవి పాల్గొన్నారు.

## టిడిపి మద్దతుదారు గెలుపు

సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మేజర్ పంచాయతీ 12వ వార్డుకు బుధవారం జరిగిన ఉప ఎన్నికలో టిడిపి మద్దతుదారు చమళ్ల అనసూయమ్మ 5 ఓట్ల తేడాతో గెలుపొందిందని ఎన్నికల అధికారి ఎల్.పాపారావు ప్రకటించారు. సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం నిర్వహించిన ఎన్నిక ప్రశాంతంగా సాగింది. 546 ఓట్లకు గాను, 349 ఓట్లు పోలయ్యాయి. టిడిపి మద్దతుదారు చమళ్ల అనసూయమ్మకు 174, వైసిపి మద్దతుదారు రెయ్య బాలకృష్ణకు 169 ఓట్లు పడ్డాయి. ఆరు ఓట్లు చెల్లనవి కాగా, 5 ఓట్లు తేడాతో అనసూయమ్మ గెలుపొందింది. అనంతరం పోలింగ్ అధికారి ఆమెకు ఎన్నిక పత్రం అందజేశారు. రీ కౌంటింగ్ నిర్వహించాలని వైసిపి ఏజెంట్లు పట్టుబట్టారు. ఏమైనా సమ్యలు ఉంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని ఎన్నికల అదికారులు



నియామకపత్రం అందుకుంటున్న అనసూయమ్మ

తెలిపారు. అనసూయమ్మకు టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్ నాయుడు, మాజీ సర్పంచ్‌లు చెట్టి కాంతారావు, మెండ అప్పారావు, అల్లు రమేష్, కుచెట్టు భానుప్రకాష్, బెండి అరుణ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి ఎంపిడిఒ సిహెచ్ .ప్రేమలీల, ఇఒపిఆర్‌డి హనుమంతు శశిభూషణ రావు, టెక్కలి సిఐ సూర్యచంద్రమౌళి, సంతబొమ్మాళి ఎస్ఐ కె.మధుసూదనరావు, కోటబొమ్మాళి ఎస్ఐ ఆలీ పటిష్ట భద్రత నిర్వహించారు.



మాట్లాడుతున్న సిఐ శ్రీనివాసరావు

## అసభ్యకర పోస్టులు పెడితే చర్యలు

పలాస : సోషల్ మీడియాలో రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు అసభ్యకరమైన పోస్టులు పెడితే కఠినంగా చర్యలు ఉంటాయని కాశీబుగ్గ సిఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం రాత్రి టిడిపి, వైసిపి, జనసేన పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టడం ద్వారా శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందన్నారు. సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, వైసిపి నాయకులు బత్తిన లక్ష్మణ్, జనసేన నాయకులు కూన కృష్ణారావు పాల్గొన్నారు.

## బిసి నాయకులపై దాడులు ఆపాలి

### యాదవ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ నాగేశ్వరరావు యాదవ్

ప్రజాశక్తి- పలాస

రాష్ట్రంలో బిసిలను టార్గెట్ చేస్తూ వైసిపి నాయకులు దాడులకు తెగబడుతున్నారని, పోలీసులు, వైసిపి నాయకులు ఒక్కటై దాడులు చేయడం సరికాదని యాదవ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ నాగేశ్వరరావు యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. కాశీబుగ్గలో టిడిపి బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్ అధ్యక్షతన ఆయన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ టిడిపి యాదవ సంఘ నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నిరకాలూగా మాఫియాలు రాజ్యమేలుతున్నాయని విమర్శించారు. పలాసలో టిడిపి కార్యకర్తలపై దాడులు చేస్తూ... తిరిగి వారిపైనే కేసులు పెట్టే కార్యక్రమం జరుగుతుందని, దీన్ని ఎండగట్టేందుకు పెద్ద ఎత్తున యాదవలు కదలిరావాలని పిలుపునిచ్చారు. మందస మండలం టిడిపి సోషల్ మీడియా కార్యకర్త తలగాన రాజశేఖర్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

క్షతగాత్రుడు రాజశేఖర్ మాట్లాడుతూ మంత్రి సీదిరి అప్పలరాజు తనపై కక్ష గట్టారని, పథకం ప్రకారం హోటల్‌కు వచ్చి దాడి చేశారని వాపోయారు. సమావేశంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, ఇప్పిలి జగదీశ్వరావు, దాసరి తాతారావు, వంకల కూర్మారావు, అంబటి కృష్ణమూర్తి, డొక్కరి శంకర్, ఎస్.చిట్టిబాబు, సాలిన మాధవరావు, కొరికాన శంకర్, బద్రి గోపాల్, కొండే నర్సింహులు, దశరధ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగేశ్వరరావు యాదవ్



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

# విశ్రాంత ఉద్యోగులకు పూర్తి సహకారం

## రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

**ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్**

విశ్రాంత ఉద్యోగులు తమ దైనందిన జీవనంలో అనుభవాలను ప్రస్తుత తరానికి అందించాలని, వారికి తన వంతు పూర్తి సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు. నగరంలోని ఎపి హెచ్‌బి కాలనీలో విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యాన నిర్మించుకున్న నూతన భవనాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎన్నో ఒత్తిళ్లను జయించి ఎన్నో ప్రభుత్వాలను సమర్థవంతంగా నడిపించిన ఘనత విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఉందన్నారు. ఏ ప్రభుత్వం ఎలా పని చేస్తుందన్న ఆలోచన చేయగల సమర్థత ఉందన్నారు. వారి సమర్థవంతమైన అనుభవాలను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘ కన్వీనర్ దొంతం పార్వతీశం, విశ్రాంత జాయింట్ కలెక్టర్ పొట్నూరు రజనీకాంతరావు, బల్ల అప్పారావు, చల్లా ప్రేమానంద్, జొన్నవిత్తుల మహేశ్వర శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మెంటాడ పద్మావతి, అంధవరపు సూరిబాబు, కోణార్క్ శ్రీను, కాలనీ సంక్షేమ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వాసుదేవరావు, విజయ్, కృష్ణారావు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న నాగేశ్వరరావు

# క్రమశిక్షణతో విద్యాభ్యాసం

**ప్రజాశక్తి- టెక్కలి రూరల్**

ఐతమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో డిప్లొమోకు చెందిన వివిధ కోర్సుల్లో ప్రవేశించిన విద్యార్థుల క్రమశిక్షణతో, పట్టుదలతో విద్యను అభ్యసించాలని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు సూచించారు. విద్యార్థుల తల్లితండ్రులకు ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సును బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాలలోని మౌలిక వసతులను, ల్యాబులను, గ్రంథాలయాన్ని, సీనియర్ ఫ్యాకల్టీ అనుభవాలను పూర్తిగా వినియోగించుకోవాలన్నారు. డిప్లొమో కోర్సు పూర్తి చేసిన వారికి పలు ప్రయివేటు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. సొసైటీ కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు మాట్లాడుతూ రోజూ కళాశాలకు విద్యార్థులను పంపే భాద్యతను తల్లితండ్రులు తీసుకోవాలన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు ఉపయోగిస్తున్న ల్యాబుల్ ఇతర సదుపాయాలు ఉపయోగించుకొనే అవకాశం డిప్లొమో విద్యార్థులకు కలుగుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డిప్లొమో డిప్యూటీ డైరెక్టర్ బి.ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# సైమన్‌కు ఎదురొడ్డిన ధీశాలి 'టంగుటూరి'



శ్రీకాకుళం అర్బన్: విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సురేఖ

**ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్**

స్వతంత్ర పోరాటంలో సైమన్ కమిషన్‌కు తన గుండెను చూపించి ఎదురొడ్డిన ధీశాలి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ అన్నారు. నగరంలోని గాంధీ మందిరంలో టంగుటూరి 151వ జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. ముందుగా టంగుటూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాధారణ కుటుంబంలో జన్మించిన ఆయన ఉన్నత చదువులు అభ్యసించి స్వతంత్ర పోరాట స్ఫూర్తిదాతగా పేరుగాంచారన్నారు. ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా, నీతి, నిజాయితీతో పనిచేశారన్నారు. కార్యక్రమంలో గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు జామి భీమశంకర్, వావిలపల్లి జగన్నాథంనాయుడులు, డాక్టర్ నిక్కు అప్పన్న, నక్క శంకరరావు, పందిరి అప్పారావు, మెట్ట అనంతభట్లు, తర్లాడ అప్పలనాయుడు, మెట్ట సులోచన, పి.కామేష్, ఎం.వి.ఎస్.ఎస్.శాస్త్రి పాల్గొన్నారు. అనంతరం విగ్రహ దాతలు మెట్ట గౌరీశంకర్, అఖిలను దుశ్శాలువతో కప్పి సన్మానించారు.

**జలుమూరు:** మండల పరిషత్ కార్యాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి ఎంపిపి వాన గోపి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎల్.వి.అప్పారావు, ఎంఇఒ బమ్మిడి మాధవరావు, మండల ఎఒ ఎం.దామోదరరావు, సిఆర్‌పి వైకుంఠరావు పాల్గొన్నారు.

**ఆమదాలవలస :** మండల పరిషత్ కార్యాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ కిరణ్, టైపిస్ట్ సంతోష్‌కుమార్, కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

**పోలాకి :** మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ బి.సూర్యప్రకాష్ ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 లింగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

**లావేరు :** లావేరు శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

**సంతబొమ్మాళి :** మండలంలోని బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రకాశం పంతులు చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణారావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో బాడాన రాజు, టి.లోకేశ్వరరావు, డి.ఉమాశంకర్, ఎ.వెంకటరెడ్డి, బాడాన రాజు, డి.ఉమాదేవి, టి.విజయలక్ష్మి, కె.తవిటిరెడ్డి, రజని, శంకరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

**ఆమదాలవలస :** టంగుటూరి ప్రకాశం పంతులు 151వ జయంతి సందర్భంగా బుధవారం మునిసిపల్ కార్యాలయంలో కమిషనరు ఎం.రవిసుధాకర్ ఆధ్వర్యాన ఘన నివాళలు అర్పించారు. ఈ సందర్భంగా కమిషనరు మాట్లాడుతూ టంగుటూరి స్ఫూర్తితో సమాజంలో పేరుకున్న అంతరాల నిర్మూలనపై ప్రతి ఒక్కరూ భాధ్యత వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ బి.లక్ష్మీనారాయణ, టి.పి.ఎస్. హెచ్.వి. సత్యనారాయణ, సి.హెచ్ శ్రీనివాసరావు, ఎస్.హరీష్, ఎ.వి శ్రీనివాస్, జి.రవి, పెంటయ్య, పద్మనాభం, పార్వతీశం తదితరులు పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం :** మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో 9వ వార్డ్ కౌన్సిలర్ జగన్ , టి.పి.ఎస్ నారాయణరావు, మెప్మా అధికారి జానికి రామారావు, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, అర్‌పిలు పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి

**ప్రజాశక్తి- టెక్కలి రూరల్**

గ్రామంలో మౌలిక సదుపాయాలపై దష్టి సారించాలని నియోజకవర్గంలోని 20 శాఖల అధికారులతో టెక్కలి నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్చార్జ్ దువ్వాడ వాణి ఆమె నివాస గృహంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు దష్టి సారించాలని కోరారు, వ్యవసాయ శాఖ పనులు ముమ్మరంగా జరుగుతున్న దష్ట్యా రైతులకు అవసరమయ్యే ఎరువులు తదితర ముడి సరుకులు అందుబాటులో రైతు భరోసా కేంద్రంలో ఉంచాలని, విద్యుత్తు అవసరాలకు సంబంధించి గ్రామాల్లో అవసరమైనచోట విద్యుత్ స్తంభాలు నెలకొల్పాలని, సమయపాలన పాటించకుండా విద్యుత్ సరఫరా నిరంతరం సాగించి పవర్ కట్ కు అవకాశం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు, విశ్వసముద్ర కాంట్రాక్టర్ వాహనాల ద్వారా పోర్టు నిర్మాణం కోసం రాయి, తదితర ముడిసరుకు సరఫరా చేసే విషయమై మాట్లాడుతూ అధిక లోడ్లతో రోడ్లు శిథిలం



మాట్లాడుతున్న దువ్వాడ వాణి

అవుతున్నాయని, ఎప్పటికప్పుడు రోడ్ల పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు, టెక్కలి జిల్లా ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న అధ్వాన్న సేవలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని ఆ శాఖ అధికారులను సూచించారు, వైద్యులు సమయపాలన పాటించేలా తరచూ తనిఖీలు నిర్వహించాలని, ఆసుపత్రికి వచ్చే రోగులను శ్రీకాకుళం రిఫర్ చేయకుండా ఇక్కడే వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని సమన్వయ అధికారిని ఆమె కోరారు, ఈ కార్యక్రమంలో సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, నందిగాం, టెక్కలి మండల స్థాయి 20 శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వివాదాస్పద స్థలం అప్పగింత

**ప్రజాశక్తి- రణస్థలం**

రణస్థలం మండల కేంద్రం జె.ఆర్.పురం ఎంపియుపి పాఠశాలకు ఎదురుగా ఉన్న రెవెన్యూ సర్వే నంబరు 2/1 ఉన్న 13 సెంట్లు వివాదాస్పద స్థలం హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది. అయితే ఆ స్థలం గ్రామకంఠంగా నిర్ధారించినందున రెవెన్యూ అధికారులు ఆ స్థలాన్ని రక్షించే బాధ్యత మీదేనంటూ జె.ఆర్.పురం పంచాయతీ కార్యదర్శికి లిఖితపూర్వకంగా తెలియజేస్తూ బుధవారం నోటీసులు అందజేశారు. రణస్థలం రెవెన్యూ పరిధిలోని ఈ స్థలం అధికార పార్టీకి చెందిన నాయకులు ఆక్రమించి ప్రొక్లెయినర్‌తో చదును చేశారు. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందిస్తూ తహశీల్దార్ ఆధ్వర్యాన సర్వేయర్, విఆర్‌ఒలు తొలుత భూమిని సర్వే చేప్పారు. 13 సెంట్లు గ్రామకంఠం మని, హైకోర్టులో పెండింగ్‌లో ఉందని గుర్తించారు. అనంతరం ఈ నివేదికను తహశీల్దార్ సనపల కిరణ్‌కుమార్‌కు అందజేశారు. హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని, కోర్టు తీర్పు వచ్చేంతవరకు ఆ భూమిని రక్షించాల్సిన బాధ్యత పంచాయతీ అధికారులదేనని నోటీసు అందజేశారు. అలాగే ఎంపిడిఒకు, జె.ఆర్.పుపురం ఎస్ఐకి నోటీసులు అందజేశారు.

# నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

**జలుమూరు:** మండలంలోని చల్లబానిపేట సబ్‌షన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు టెక్కలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. లింగాలవలస జగనన్న హౌసింగ్ కాలనీలో రోడ్లు, ఇతర పనుల నిమిత్తం 33/11 కెవి చల్లవానిపేట సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కెవి.జలుమూరు హెడ్ క్వార్టర్స్, అల్లాడ, చల్లవానిపేట లిఫ్టు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్న 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. జలుమూరు, చల్లవానిపేట, అల్లాడ, టెక్కలిపాడు, తిలారు, లింగాలవలస, నారాయణ వలస, చిన్నదుగాం, పెద్దదూగం గ్రామస్తులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

**కవిటి :** మండలంలోని రాజపురం టౌన్ ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ నేతాజీ తెలిపారు. రాజపురం నుంచి కవిటి వెళ్లే రోడ్డులో ఆర్.డబ్ల్యు.ఎస్ సర్వీస్ కోసం ట్రాన్స్ఫార్మర్ పనులు చేయనున్నట్టు ఆయన తెలిపారు. దీంతో టౌన్ ఫీడర్ పరిధిలోని గ్రామాలైన కవిటి, ప్రగడపుట్టుగ, రామయ్యపుట్టుగ, గొండ్యాలపుట్టుగ, కొత్తపాలెం గ్రామాల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ తెలిపారు. ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



ఎంఇఒతో మాట్లాడుతున్న గ్రామస్తులు

# మా ఉపాధ్యాయుడిని మార్చొద్దు

**ప్రజాశక్తి - మెళియాపుట్టి**

మా పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడిని మార్చవద్దని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, పార్టీలకతీతంగా గ్రామస్తు మండల విద్యాశాఖ అధికారి ఎస్ . దేవేందర్ రావుకి బుధవారం వినతి పత్రాన్ని అందించారు. ఉపాధ్యాయుడు నారాయణమూర్తిని స్థానచలనం చేస్తున్న విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు తరగతి గదిలోకి విద్యార్థులను పంపించకుండా పాఠశాల ఎదుటే ప్లకార్డులు పట్టుకొని, నినాదాలు చేస్తూ తమ తెలిపారు.. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రతినిధి మాలతి శ్రీధర్, స్థానిక వైకాపా నాయకులు, ఎంపీటీసీ ప్రతినిధి ఉర్లాన ఋషిలు తమ గ్రామస్తులతో కలిసి మండల విద్యాశాఖ అధికారిని కలిసి మాట్లాడుతూ తమ ప్రాథమిక పాఠశాలలో సుమారు 62 మంది వరకు విద్యార్థులున్నారని, ఆ ప్రక్రియ నిలుపుదల చేయాలని విజ్ఞాపన పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ గేదెల ధర్మారావు, శ్రీరామ్ శ్రీను, ఉర్లాన కోదండ, బి. సోమేష్, టి. నూకరాజు, బి. సత్యం, ఆర్. కాంతారావు, గ్రామస్తులు తదితరులున్నారు.

# రేపు జిల్లా మహాసభ

**కొత్తూరు :** ఈ నెల 25న మెళియాపుట్టిలో 8వ గిరిజన జిల్లా మహాసభ నిర్వహిస్తున్నామని, గిరిజనులు పాల్గొని విజయవంతం చేయాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మక అప్పన్న ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల ఫలితంగా గిరిజనులు తీవ్రంగా ఇబ్బందులు గురవుతున్నారని అన్నారు. జిల్లాలో గిరిజనులకు ఐటిడిఎ లేదని అన్నారు. గిరిజనులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు.

# పారదర్శకంగా పనిచేయాలి

**ప్రజాశక్తి- కవిటి**

వసతి గహాల నిర్వహణలో సిబ్బంది పారదర్శకంగా పనిచేయాలని, ముఖ్యంగా వసతి గహాల్లో సీట్లు భర్తీ చేయడంలో పూర్తి పారదర్శకత పాటించాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ సూచించారు. మండలంలోని రామయ్యపుట్టుగ గ్రామంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వసతి గహాల సలహా సంఘం సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడిన ఎమ్మెల్యే వసతి గహాల నిర్వహణపై వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, తప్పనిసరిగా మెనూ అమలు చేయాలని సూచించారు. అదేవిధంగా వార్డెన్లు విద్యార్థులకు అందుబాటులో ఉంటూ వారిపై ప్రత్యేక దష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి బాలముకుందరావు, నాలుగు మండలాల వసతి గృహ అధికారులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఆదినారాయణ

# సైన్స్ ప్రాధాన్యతని గుర్తించాలి

**టెక్కలి:** విద్యార్థులు సైన్స్ ప్రాధాన్యతని గుర్తించాలని శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకులు డి.ఆదినారాయ ణ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యాన విద్యార్థులకు బుధవారం సెమినార్ నిర్వహించారు. మానవ జీవితంలో సైన్స్ ఏ విధంగా దోహద పడుతుందో అన్న విషయాన్ని వివరించారు. రసాయన శాస్త్ర విభాగం నిర్వాహకులు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సతీష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌లో నాక్ కో-ఆర్డినేటర్ ఝాన్సీరాణి, అధ్యాపకులు చంద్రశేఖర్, లీలాపద్మజ, తిరుమల, కాసవయ్య పాల్గొన్నారు.

# అర్హులందరికీ జగనన్న తోడు రుణాలు

**ఆమదాలవలస :** ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అమలు పరుస్తున్న నవరత్నాల తోపాటు, వీధి వ్యాపారులు చిల్లర వర్తకుల తోపుడు బండ్లు తదితర చిన్న చిన్న వ్యాపారస్తులకు పెట్టుబడి సహాయం కోసం జగనన్న తోడు పథకం వర్తింపజేయాలని వైఎస్సార్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు సిబ్బందికి సూచించారు. బుధవారం కొర్లకోట క్లస్టర్ స్థాయి సిబ్బంది సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేవలం కుటుంబ పోషణ కోసం చిన్న తరహా వ్యాపారం చేసుకుంటున్న వారు మైక్రో ఫైనాన్స్ వడ్డీ వ్యాపారస్తుల బారినపడి సంపాదనలో అధిక శాతం వడ్డీలకు చెల్లించే వారందరినీ గుర్తించి, ప్రభుత్వమే వడ్డీ భరిస్తూ, కేవలం అసలు కట్టుకోమని అందిస్తున్న జగనన్న తోడు పథకానికి బయోమెట్రిక్ వేయించి, దరఖాస్తులను సంబంధిత బ్యాంకులకు పంపించి, తక్షణమే మంజూరు చేయించాల్సిందిగా సిబ్బందికి ఆదేశించారు. క్లస్టర్ కోఆర్డినేటర్ ఇ.వి.రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

## సంక్షిప్త వార్తలు

### అక్టోబరు నాటికి టిడ్కో ఇళ్లు సిద్ధం

**ఆమదాలవలస :** శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రత్యేక చొరవతో ఈ ఏడాది అక్టోబరు నెలాఖరునాటికి స్థానిక జగ్గుశాస్త్రులపేటలో టిడ్కో ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేయడానికి యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నట్లు మెప్మా పి.డి. ఎం.కిరణ్ కుమార్ తెలిపారు. బుధవారం టిడ్కో అధికారులు, బ్యాంకు మేనేజర్లతో కలిసి క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొత్తంగా మూడు కేటగిరీలలో 528 ఇళ్లను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. గహాలు వచ్చిన లబ్ధిదారులు నిబంధనల మేరకు చెల్లించాల్సిన లబ్ధిదారుల వాటా చెల్లించడంతోపాటు బ్యాంకు రుణం ఒప్పందం పూర్తిచేయాల్సి ఉందన్నారు. బ్యాంకు రుణం వద్దంటే ఆ మేరకు లబ్ధిదారులే నగదు చెల్లించుకునే వెసులుబాటు ఉందన్నారు. లేనిపక్షంలో నిబంధనల మేరకు చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. టిడ్కో ఈఈ సీతారామ్మూర్తి మాట్లాడుతూ ఇప్పటికే 95 శాతం నిర్మాణ పనులు జరిగాయన్నారు. మిగిలిన పనులను పూర్తిచేసి అక్టోబరునాటికి సిద్ధం చేసి అందజేస్తామన్నారు. పరిశీలనలో మెప్మా జిల్లా సమన్వయ అధికారులు కె.వి.సత్యనారాయణ, ఎస్.వెంకటరావు, స్థానిక యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్లు శ్రీనివాసరావు, భార్గవి తదితర మెప్మా, టిడ్కో అధికారులు పాల్గొన్నారు.

### పాఠశాలకు మొక్కలు వితరణ

**కోటబొమ్మాళి:** మండలంలోని దంత ప్రాథమికోన్నత పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న విద్యార్థిని బాడాన మోక్షశ్రీ బుధవారం పుట్టిన రోజు కానుకగా ఆమె తల్లితండ్రులు బాడాన గోవిందరావు, రాణిలు 40 మొక్కలను పాఠశాలకు వితరణ అందజేశారు. పుట్టినరోజు వేడుకలో తాను చదువుతున్న ప్రభుత్వ పాఠశాలలో పచ్చదనం పెంచడం కోసం మొక్కలు వితరణ చేయడం అభినందనీయమని అన్నారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ, సామాజిక స్పృహ తదితర విలువలు పెంపిందించడానికి ఇలాంటి కార్యక్రమాలు చాలా అవసరమని ప్రధానోపాధ్యాయులు గొండు నారాయణరావు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి

**పొందూరు:** కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలని డిటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గండెం రామారావు కోరారు. మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొన్నేళ్లుగా సంపాదిత సెలవులకు సంబంధించిన బిల్లులు ఇంతవరకు చెల్లించలేదని, అలాగే ఉపాధ్యాయులు తమ ఖాతాలో దాచుకున్న జెడ్‌పి పిఎఫ్ సొమ్ములనూ చెల్లించకపోవడంతో ఉపాధ్యాయ, ఉద్యోగులు నిరాశ చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జి.గోపాలరావు, జిల్లా కార్యదర్శి గురుగుబెల్లి భాస్కరరావు, మండల బాధ్యులు గురుగుబెల్లి రాజు పాల్గొన్నారు.

### భూ రక్షతో రైతులకు మేలు

**ఆమదాలవలస :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న శాశ్వత భూహక్కు - భూ రక్ష పథకంతో రైతులకు మేలు కలగనుందని సర్పంచ్ చిలకలపల్లి సురేష్ అన్నారు. మండలంలోని వెదుళ్లవలసలో భూములకు డ్రోన్లతో భూ రీ సర్వే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకం దూర దృష్టితో ఆలోచించి రీ సర్వే చేయించడం మంచి శుభపరిణామని అన్నారు. దీంతో గ్రామాల్లో ఎటువంటి వివాదాలు చోటు చేసుకోవాలన్నారు. జగనన్న శాశ్వత భూహక్కు పత్రాలతో రైతులకు రుణాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ సూర్యనారాయణ, మండల సర్వేయర్ బొడ్డేపల్లి గోపి, సచివాలయ సర్వేయర్ ఎండ రమణ పాల్గొన్నారు.

### జనసైనికుల సాయం

**ఆమదాలవలస:** ఆదివారం పేట వద్ద ద్విచక్ర వాహన ప్రమాదంలో మతి చెందిన అయ్యప్ప స్వామి దేవస్థానం అర్చకుడు జగన్ శర్మ కుటుంబానికి జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పేడాడ రామ్మోహనరావు ఆధ్వర్యంలో రూ.5 వేల నగదును ఆర్థిక సహాయం చేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో చురుకుగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేవాడని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సిర్లాపు గణేష్, గంగు కోటేష్, గురుగుబెల్లి అశోక్, బాగాది ఫణి, తుంగాన తవిటి నాయుడు గొద్దు కోటేశ్వరరావు హేమంత్ సాయి పాల్గొన్నారు.

**కవిటి :** కవిటి మండలం కమలాయిపుట్టుగ గ్రామానికి చెందిన జనసైనికుడు చీరపు దేవేంద్ర ఇటీవల మరణించిన విషయం తెలుసుకున్న జనసేన పార్టీ ఇంచార్జ్ దాసరి రాజు, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ తిప్పన దుర్యోధన రెడ్డి బుధవారం గ్రామానికి చేరుకుని ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అంతేకాకుండా గ్రామ జన సైనికులు, నీలకంఠేశ్వర యూత్ సహాయంతో రూ.33,500లు దేవేంద్ర తల్లిదండ్రులకు అందించారు. కార్యక్రమంలో రోకళ్ల భాస్కరరావు, జనసైనికులు పాల్గొన్నారు.

### విద్యా సాహితీ వాలంటీర్లకు శిక్షణ

**ప్రజాశక్తి- లావేరు**

బెజ్జిపురం యూత్ క్లబ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇండియా లిటరసీ ప్రాజెక్టు సహకారంతో నిర్వహిస్తున్న స్కూల్ రెడీనెస్ బాలవికాస్ ప్రోగ్రాంలో భాగంగా రెండు రోజుల విద్యాసాతీ వలంటీర్ల శిక్షణా కార్యక్రమాన్ని శ్రీకాకుళం కార్యాలయంలో నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి రీసోర్స్ పర్సన్స్‌గా సంస్థ డైరెక్టర్ ఎమ్.ప్రసాదరావు, లెర్నింగ్ కో ఆర్డినేటర్ టి. కరుణాకర రావు అధ్యక్షతన తెలుగు వర్క్ బుక్ ఆవిష్కరించారు.. ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం. ప్రసాద రావు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఈ శిక్షణను వినియోగించుకుని విద్యార్థులను బాగా తీర్చిదిద్దాలని, అదేవిధంగా విద్యాసాతి వలంటరీలు మరింత బాగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కోశాధికారి జి.అప్పలనాయుడు మాట్లాడుతూ పిల్లలలో అభ్యాసన సామర్థ్యాలు మెరుగు పడేలా చూడాలన్నారు.. ప్రాజెక్టు కో ఆర్డినేటర్ పి.మాధవి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

# జానపద కళలు వారసత్వ సంపదకు ప్రతీకలు

**ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు**

జానపద కళలు వారసత్వ సంపదకు ప్రతీకలని ఉద్దానం సాహితీ సాంస్కృతిక వేదిక ప్రధాన కార్యదర్శి చిక్కోలు జగదీష్ అన్నారు. ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా మంగళవారం రాత్రి లండ రుద్రమూర్తి అధ్యక్షతన వజ్రపుకొత్తూరులో ఉద్దానం సాహితీ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యాన వివిధ జానపద కళా ప్రదర్శనలు నిర్వహించారు.

పలాస-కాశీబుగ్గకు చెందిన కవి, రచయిత తెప్పల కృష్ణమూర్తికి 'ఉద్దానం బంధు పురస్కారం23'ను అందించి ఘనంగా సన్మానించారు. కవి, రచయిత, పాత్రికేయులు వంకల రాజారావు జానపద దినోత్సవం ప్రాశస్త్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా సింగిరి కీర్తిక, సుధీష్ణల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జెస్సీ ఈవెంట్స్, బొడ్డపాడు కళాకారులు జానపద నృత్యాలు, రంగం కళాకారులు తప్పెటగుళ్ళు, స్థానిక కళాకారులు ప్రదర్శించారు. కళాకారులు కుత్తుమ వినోద్, కె.హేమసుదన్, అందాల కోటేశ్వరరావు, జోగారావు, శాంతారావు జానపద గేయాలు ఆలపించారు. వేదిక కార్యదర్శి సీనియర్ పాత్రికేయులు శివజ్యోతి వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి పుక్కళ్ల గురయ్యాడు, ఎంపిటిసి మాజీ



తప్పెటగుళ్లు ప్రదర్శిస్తున్న కళాకారులు

సభ్యులు ఈరోతు హేమంత్, బచ్చాల జోగారావు, వేదిక సభ్యులు గుమ్మడి సాంబమూర్తి, ఉర్నాన అప్పలరాజు, తెప్పల వాసుదేవరావు, డి.రాజగోపాల్, కె.ఆదినారాయణ, బత్తిన బాలకృష్ణవర్మ, టి.బాబూరావు పాల్గొన్నారు.

# మొక్కలతోనే మానవ మనుగడ



మొక్కను నాటుతున్న ఎంపిపి నీలవేణి

**వజ్రపుకొత్తూరు:** మానవ మనుగడకు, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంపకం అవసరమని ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి అన్నారు. కొండవూరు చాకిరేవు చెరువు గట్టుపై ఎన్ఆర్ఇజిఎస్ ఆధ్వర్యాన బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృక్ష సంపద తరిగిపోవడం వల్ల వాతావరణంలో కాలుష్యం పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణ కాలుష్యంతో జీవరాశుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని పేర్కొన్నారు. వర్షాభావం ఏర్పడి పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. చెరువు, కాలువ గట్లు, బీడు భూములలో మొక్కలు నాటడానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గ్లోబల్ వార్మింగ్ వల్ల భూతాపం పెరిగి జీవరాశులు అంతరించే ప్రమాదం ఉందన్నారు. ప్రతిఒక్కరూ తమ పరిధిలో మొక్కలు నాటడానికి ముందుకు రావాలని కోరారు. భావితరాలకు కాలుష్యరహిత సమాజాన్ని అందించే గురుతర బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, సర్పంచ్ కొల్లి భాస్కరరావు, ఎంపిటిసి మాజీ సభ్యులు ఇప్పిలి అప్పన్న, ఉప సర్పంచ్ లండ ఆనందరావు, బూత్ కన్వీనర్ లండ సూర్యనారాయణ, దట్టి నాగేశ్వరరావు, కోనారి సింహాచలం, యడ్ల శ్రీనివాసరావు, కొరికాన అప్పారావు, కర్రి పాపారావు, ఫీల్డ్ అసిస్టెంట్ కోనారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తం

**ప్రజాశక్తి- ఆమదాలవలస**

సైబర్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని యూనియన్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని 16వ వార్డు పూజారిపేటలోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో ఆర్థిక అక్షరాస్యతపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫలానా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా ఫోన్ చేసి అకౌంట్ వివరాలను అడిగితే అటువంటి వారికి సమాచారం ఇవ్వవద్దని సూచించారు.

బ్యాంకులు ఎప్పుడూ ఖాతాదారుల వివరాలను ఫోన్ చేసి తెలుసుకోవని తెలిపారు. ఎటిఎంల్లో అపరిచితులకు కార్డును ఇచ్చి డబ్బులు విత్ డ్రా చేసి పెట్టమని కోరరాదని తెలిపారు. రూపే ఎటిఎం కార్డుల ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్ మెన్ 14448 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో గోల్డ్ ఆపరేటర్ మురళీధర్, ఆర్.పి.స్వర్ణ, సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్లు హరనాథ్, చిగురుపల్లి వెంకటేష్, రామారావు పాల్గొన్నారు.

# నాయకుల పరామర్శ



నగదును అందజేస్తున్న గోవిందరావు

**ఎల్ఎన్‌పేట :** మండలంలోని కొమ్మవలసకు చెందిన జమ్మన ఆదినారాయణ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న పాతపట్నం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు, సామాజికవేత్త మామిడి గోవిందరావు వారి కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. అనంతరం రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. భవిష్యత్‌లో ఏ అవసరం వచ్చినా నేనున్నానని భరోసా ఇచ్చారు. అలాగే కోవిలంకు చింతపల్లి అప్పారావు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ కాగాన మన్మథరావు, అంపిలి పోలినాయుడు, ముగుడ భద్రయ్య, తామర మాజీ సర్పంచ్ సిరిపురం బాబూరావు, పంగ కృష్ణారావు, కంచాల బాలకృష్ణ, బొమ్మాళి నవీన్, మామిడి రవికుమార్ పాల్గొన్నారు.

**అప్పలనాయుడు...**

**లావేరు :** మండలంలోని గోవిందపురం పంచాయతీ ఇజ్జడాపాలెంకు చెందిన మాజీ సర్పంచ్ గొర్లె రామినాయుడు తండ్రి అప్పలనాయుడు అనారోగ్యంతో నెల్లిమర్లలో మిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వైసిపి నియోజకవర్గ నాయకులు లుకలాపు అప్పలనాయుడు బుధవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఈయన గురునాయుడు, శ్రీనివాసరావు, టిఎస్ఆర్ ఉన్నారు.

**మామిడి శ్రీకాంత్...**

**మెళియాపుట్టి :** మండలంలో పద్ద ఆంపురం తదితర గ్రామాల్లో రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ బుధవారం పర్యటించారు. పద్ద గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ విశ్వనాథ్ బిసాయి భార్య ఇటీవల మతి చెందడంతో వాళ్ల కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఆంపురం గ్రామానికి చెందిన రింపి పోలమ్మ, రింపి తాతయ్య, నేల బొంతు సుప్రజ,, బి. కాశమ్మ ఇటీవల వివిధ కారణాలతో మతి చెందడంతో వాళ్ల కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి ఓదార్చరు. మతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్ ఆదినాయుడు, వైస్ ఎంపీపీ ప్రతినిధి పాడి అప్పారావు, సర్పంచులు గణేష్ ప్రధాన్, పెద్దింటి చంద్రరావు, బోసి రామారావు, జనపరెడ్డి కన్నబాబు, సిద్ధిపాలెం గౌరీస్, మజ్జి రాము, పెద్ద బొంతు అప్పారావు, ధర్మారావు, నక్క వెంకట్రావు, వాబ జగన్, తారక్, బైరాగి తదితరులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న మామిడి శ్రీకాంత్